# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 11 | శుక్రవారం, 12 సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




# రైల్వే ప్రాజెక్టులపై ఫోకస్

వికారాబాద్– కృష్ణా కొత్త లైన్ పనులను త్వరగా చేపట్టాలి

ఇండస్ట్రియల్ కారిడార్ కోసం స్పెషల్ లైన్

శంషాబాద్ – చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను పరిశీలించాలి

ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం రేవంత్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

పెండింగ్లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు ..మిగతా 2లో

# జూబ్లీహిల్స్‌లో పార్టీల ఎత్తుకు పై ఎత్తు

ఈ నెలాఖరున నోటిఫికేషన్ వచ్చే అవకాశం

అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీలు కసరత్తు

సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు బీఆర్ఎస్ ప్లాన్

జూబ్లీహిల్స్ సీటు కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎవరనేది సర్వత్రా ఉత్కంఠ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తిగా మారింది. ఈ నెలాఖరు నాటికి నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు స్పీడ్ పెంచాయి. సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు బీఆర్ఎస్ మాగంటి గోపీనాథ్ సతీమణినే బరిలోకి దింపబోతున్నట్లు ..మిగతా 2లో

# నిమిషంలోనే కుల ధ్రువీకరణ



తెలంగాణలో 'మీసేవ'లో కొత్త విధానం..

15 రోజుల్లో 17,500 మందికి పైగా సర్టిఫికెట్ల అందజేత

ఏటా 20 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా

పాత సర్టిఫికెట్ నంబర్‌తో తక్షణమే కొత్త పత్రం పొందే వీలు

02



# బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

కావాలనే యూరియా సరఫరా చేయడం లేదు

యూరియా కొరతపై విపక్షాలు దుష్ప్రచారం

రైతులను కావాలనే బీఆర్ఎస్ రెచ్చగొడుతోంది

కామారెడ్డిలో పర్యటన మంత్రి సీతక్క

03



# నన్నే టార్గెట్ చేశారు

ఈ20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్నది పెయిడ్ క్యాంపెయిన్

రాజకీయంగా నన్ను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి

ఇథనాల్ విధానంతో రైతులకు రూ. 45,000 కోట్ల మేలు

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

03

# కేటీఆర్‌కు అంతర్జాతీయ పురస్కారం

ప్రతిష్ఠాత్మక 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక

పర్యావరణ పరిరక్షణ కృషి చేశారంటూ పురస్కారం

అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న అవార్డు ప్రదానోత్సవం

ఈ నెల 24న 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్'లో పురస్కార ప్రదానం



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణకు కేటీఆర్ కృషి చేశారంటూ, ఆయనను 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఘనంగా జరగనుంది. ఈ నెల సెప్టెంబర్ 24వ తేదీన అక్కడ ..మిగతా 3లో

# ఓటరు జాబితాలో పేరు.. సోనియా గాంధీకి ఊరట

సోనియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న పిటిషన్ కొట్టివేత

పౌరసత్వానికి ముందే ఓటరు జాబితాలో పేరు చేర్చారని ఆరోపణ

నకిలీ పత్రాలు వాడారంటూ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్

ఆరోపణలను తోసిపుచ్చుతూ కోర్టు ఉత్తర్వులు



**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. భారత పౌరసత్వం పొందక ముందే నకిలీ పత్రాలతో ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్నారని ఆరోపిస్తూ ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. రౌస్ అవెన్యూ ..మిగతా 2లో

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



గరియాబంద్ జిల్లాలో జరిగిన భీకర ఎన్‌కౌంటర్

పది మంది మావోయిస్టులు హతం

మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా బలగాలకు భారీ విజయం



02

# ఖర్గే మాటలు చూస్తే నవ్వొస్తుంది

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై ఇండియా కూటమిని ఎద్దేవా

యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం

ఉద్యోగులు, విద్య, జీతాల అంశాలపై సీఎం వాగ్దానాలు ఏమయ్యాయ్

బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. రామచందర్ రావు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, "మైక్ కూడా ప్రభుత్వంలాగే పనిచేస్తున్నట్టు ఉంది, అప్పుడప్పుడు చెప్పినట్టు వినదు" అంటూ చురకలు అంటించారు. ఆయన చేసిన ప్రధాన వ్యాఖ్యలు: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్‌ను చూస్తే ఇండియా కూటమిలో ఐక్యత లేదని తేలిపోయిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ..మిగతా 2లో





# మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగిన రాధాకృష్ణన్

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నేపథ్యంలో రాజీనామా

రేపు ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేయనున్న రాధాకృష్ణన్

గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర అదనపు బాధ్యతలు

03




# నిమిషంలోనే కుల ధ్రువీకరణ

- తెలంగాణలో 'మీసేవ'లో కొత్త విధానం..
- 15 రోజుల్లో 17,500 మందికి పైగా సర్టిఫికెట్ల అందజేత
- ఏటా 20 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా
- పాత సర్టిఫికెట్ నంబర్‌తో తక్షణమే కొత్త పత్రం పొందే వీలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను ప్రభుత్వం అత్యంత సులభతరం చేసింది. గంటల తరబడి వేచి చూసే అవసరం లేకుండా, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న నిమిషంలోనే సర్టిఫికెట్ జారీ చేసే సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గత 15 రోజులుగా ఈ నూతన విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉందని, ఇప్పటికే 17,500 మందికి పైగా లబ్ధిదారులు తక్షణమే తమ కుల ధ్రువపత్రాలను అందుకున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ విధానం వల్ల ఏటా సుమారు 20 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన అంచనా వేశారు. ఇకపై బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు కొత్త సర్టిఫికెట్ కోసం ప్రతిసారీ అధికారుల ఆమోదం కోసం వేచి చూడాల్సిన పనిలేదు. గతంలో తీసుకున్న సర్టిఫికెట్ నంబర్ తెలిస్తే, దాని ఆధారంగా వెంటనే కొత్త పత్రాన్ని పొందవచ్చు. ఒకవేళ పాత నంబర్ అందుబాటులో లేకపోయినా, జిల్లా, మండలం, గ్రామం, పేరు వంటి వివరాలతో శోధించి సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం కల్పించారు. అయితే, పేరు, ఇంటిపేరు వంటి మార్పులు అవసరమైతే మాత్రం జిల్లా అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. హిందూ ఎస్సీ వర్గం నుంచి క్రైస్తవ మతంలోకి మారి బీసీసీ సర్టిఫికెట్ పొందాలనుకునే వారికి మాత్రం పాత ఆమోద ప్రక్రియే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- గరియాబంద్ జిల్లాలో జరిగిన భీకర ఎన్‌కౌంటర్
- పది మంది మావోయిస్టులు హతం
- మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ
- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా బలగాలకు భారీ విజయం

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గరియాబంద్ జిల్లాలో గురువారం భద్రతా బలగాలు, నక్సలైట్ల మధ్య జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ఒక కీలక నేతతో సహా పది మంది మావోయిస్టులు మరణించారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోడెం బాలకృష్ణ ఉన్నట్లు గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రాఖేచా ధృవీకరించారు. మృతుల్లో ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ కూడా ఉన్నాడు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా భద్రతా సిబ్బంది గరియాబంద్ జిల్లా అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్) కమాండోలు, ఇతర రాష్ట్ర పోలీస్ విభాగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. నక్సల్స్ ఏరివేత ఆపరేషన్ సందర్భంగా మావోయిస్టులు భద్రతా బలగాలపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరిగాయని రాయ్‌పూర్ రేంజ్ ఐజీపీ అమ్రేష్ మిశ్రా తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి అందిన సమాచారం ప్రకారం కనీసం ఎనిమిది మంది నక్సలైట్లు హతమయ్యారని ఆయన మొదట వెల్లడించారు. ఆపరేషన్ కొనసాగే కొద్దీ మృతుల సంఖ్య పదికి చేరిందని ఎస్పీ నిఖిల్ రాఖేచా స్పష్టం చేశారు. అటవీ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయని, ఆపరేషన్ ముగిసిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.



# రైల్వే ప్రాజెక్టులపై ఫోకస్

మొదటిపేజీ తరువాయి

ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్ను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్న్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

# జూబ్లీహిల్స్‌లో పార్టీల ఎత్తుకు పై ఎత్తు

మొదటిపేజీ తరువాయి

హింట్ ఇచ్చింది. దీంతో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎవరు అనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కంటోన్మెంట్ బై ఎలక్షన్ లో కారు పార్టీకి డ్యాష్ ఇచ్చామని ఇప్పుడు జూబ్లీహిల్స్ లోనూ అదే రిపీట్ చేసి గట్టి షాక్ ఇవ్వాలని అధికార కాంగ్రెస్ చూస్తోంది. ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్ ను ప్రజలు నమ్మడం లేదని ఈ సారి తమకు అవకాశం ఇవ్వాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఈక్రమంలో ప్రధాన పార్టీల మధ్య ఎత్తుకు పై ఎత్తులతో జూబ్లీహిల్స్ రాజకీయం రసవత్తరంగా మారగా ఇప్పుడు అభ్యర్థుల ఎంపిక విషయంలో తుది కసరత్తు స్టేట్ పాలిటిక్స్ లో మరింత ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది.

**రేవంత్ వ్యూహం ఏంటి?:**

జూబ్లీహిల్స్ బై పోల్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పని మొదలు పెట్టింది. బీఆర్ఎస్ (BRS) అభ్యర్థిగా మాగంటి సునీత పేరునే దాదాపు ప్రకటించే అవకాశాలు ఉండటంతో రేవంత్ రెడ్డి ఆమెకు పోటీగా ఎవరిని రంగంలోకి దించబోతున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. అధికార పార్టీ కావడంతో టికెట్ దక్కితే గెలుపు దాదాపు ఖాయం అనే ధీమా కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది. దీంతో టికెట్ కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈ రేస్ లో ముందు వరుసలో ఉన్న అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ పోస్టు ఇచ్చి ఆయనను సైడ్ చేసింది అధిష్టానం. దీంతో టికెట్ ఆశిస్తున్న వారిలో రోహిన్ రెడ్డి, నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్ తో పాటు మరికొంత మంది పేర్లు రేస్ లో వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఊహించని విధంగా కొత్త మొహాలు తెరపైకి వస్తున్నాయి. తనకు టికెట్ ఇవ్వాలని తాజాగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ స్వరం పెంచుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ఎలాంటి వ్యూహంతో రాబోతున్నారు అనేది మరింత ఉత్కంఠ రేపుతోంది.

**కూటమి యోచనలో బీజేపీ?:**

జూబ్లీహిల్స్ బై పోల్ లో తమ సత్తా చాటేందుకు బీజేపీ సైతం ప్రణాళికలు వేసుకుంటోంది. ఇక్కడ సెటిలర్ల ఓటర్లు కూడా భారీ సంఖ్యలో ఉండటంతో ఏపీ తరహా ఇక్కడ కూటమి తరహా ప్రయోగం ఏమైనా చేయబోతున్నారా అనేది సందేహంగా మారింది. ఇక్కడ ఇప్పటికే పలువురు అభ్యర్థుల పేర్లు పరిశీలిస్తున్న కమలం పార్టీ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు విజయారెడ్డిని బరిలోకి దింపే ఆలోచనతోనూ ఉందనే ప్రచారం జరుగుతోంది.

**బీఆర్ఎస్ కు కవిత టెన్షన్?:**

జూబ్లీహిల్స్ బై పోల్ లో ప్రధాన పార్టీల వ్యూహాలు ఒక ఎత్తైతే ఎమ్మెల్సీ కవిత అంశం మరో ఎత్తు అనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కవిత ఇక్కడ నేరుగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ పోటీ చేయకపోయినా పరోక్షంగా మద్దతు తెలిపినా అది బీఆర్ఎస్ కు పెద్ద మైనస్ అయ్యే అవకాశాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. అయితే ప్రధాన పార్టీలలో టికెట్ లభించని ఆశావహులు కవిత అండతో పోటీ చేయబోతున్నారనే టాక్ నియోజకవర్గంలో గుప్పుమంటోంది.

## ఖర్గే మాటలు చూస్తే నవ్వొస్తుంది..

మొదటిపేజీ తరువాయి

జరిగినంత రాజ్యాంగ అవహేళన ఎప్పుడూ జరగలేదని ఆయన విమర్శించారు. గవర్నర్ మాత్రం రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు ఇస్తారని, కానీ స్పీకర్ మాత్రం పిరాయింపుల పైన నిర్ణయం తీసుకోవడానికి గడువు ఉండదా అని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. యూరియా కృత్రిమ కొరతను కాంగ్రెస్ సృష్టించిందని, రాష్ట్ర ప్రభుత్వమే దీనికి కారణమని తెలంగాణ రైతులకు అర్థమైందని రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణకు అవసరమైన యూరియాను కేంద్రం ఎప్పుడో ఇచ్చిందని, కొద్దిగా ఆలస్యం కావొచ్చు కానీ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో కుటుంబ తగాదాలు ఉన్నాయని, కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య తగాదా లేదని అన్నారు. ఓయూకి వెయ్యి కోట్లు ఇస్తానని సీఎం అన్నారని, కానీ ఇప్పుడు ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు కూడా రావడం లేదని ఆరోపించారు. పార్టీలో ఎవరిపైనా వివక్ష లేదని, ఇంకా 650 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. పార్టీ కమిటీలో అందరికీ అవకాశం రాలేదని, వారి సేవలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొంటే, ఉన్న నలుగురు సభ్యులు కూడా ఉంటారో లేదో అనే భయంతోనే బీఆర్ఎస్ ఓటింగ్‌కు దూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

# ఓటరు జాబితాలో పేరు..సోనియా గాంధీకి ఊరట

మొదటిపేజీ తరువాయి



కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. 1983లో భారత పౌరసత్వం పొందిన సోనియా గాంధీ, అంతకు మూడేళ్ల ముందే, అంటే 1980 జనవరిలోనే న్యూఢిల్లీ నియోజకవర్గ ఓటరు జాబితాలో తన పేరును చేర్చుకున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. ఇది నకిలీ పత్రాల ద్వారా జరిగిందని పిటిషనర్ తరఫు న్యాయవాది పవన్ నారంగ్ కోర్టుకు తెలిపారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చినట్లు తెలిపారు. అప్పటికి ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నట్లు తెలిపారు. దీనిపై అప్పుడు విమర్శలు వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే, ఎన్నికల సంఘం ఈ అవకతవకలను గుర్తించి 1982లో ఓటరు జాబితా నుంచి ఆమె పేరును తొలగించిందని ఆయన వాదించారు. తిరిగి ఆమెకు 1983లో పౌరసత్వం లభించిన తర్వాతే జాబితాలో పేరు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిశీలించిన రౌస్ అవెన్యూ కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా, ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

## మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగిన రాధాకృష్ణన్

- ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నేపథ్యంలో రాజీనామా
- రేపు ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేయనున్న రాధాకృష్ణన్
- గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర అదనపు బాధ్యతలు



**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఉపరాష్ట్రపతిగా నూతన బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నాడు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. రాధాకృష్ణన్ రాజీనామాతో ఖాళీ అయిన మహారాష్ట్ర గవర్నర్ పదవికి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర బాధ్యతలను అదనంగా అప్పగిస్తూ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం 752 ఓట్లకు గాను ఆయనకు 452 ఓట్లు లభించాయి. మహారాష్ట్ర రాజ్ భవన్‌లో రాధాకృష్ణన్‌కు నిన్న సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజీపడని జాతీయవాదినని స్పష్టం చేశారు. గవర్నర్‌గా కొనసాగిన 13 నెలల కాలాన్ని ప్రజాజీవితంలో సంతోషకరమైన సమయంగా అభివర్ణించారు. పరిపాలనా పరంగా, రాజకీయంగా మహారాష్ట్ర తనకు ఎంతో నేర్పిందని ఆయన అన్నారు.

## కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం

మొదటిపేజీ తరువాయి

నిర్వహించనున్న 9వ 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్' వేదికగా కేటీఆర్‌కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ, హరిత విధానాల అమలులో కేటీఆర్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు చొరవ చూపారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారం కేటీఆర్‌కు వ్యక్తిగతంగానే కాకుండా, తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు జరిగిన ప్రయత్నాలకు లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## నన్నే టార్గెట్ చేశారు

- ఈ20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్నది పెయిడ్ క్యాంపెయిన్
- రాజకీయంగా తనను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి
- ఇథనాల్ విధానంతో రైతులకు రూ. 45,000 కోట్ల మేలు
- కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ



**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం (E20)పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. అదంతా తనను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని, డబ్బులిచ్చి నడిపిస్తున్న ప్రచారం అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సొసైటీ ఆఫ్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో పాల్గొన్న ఆయన, ఇథనాల్ మిశ్రమంపై వస్తున్న ఆందోళనలపై అడిగిన ప్రశ్నలకు ఈ విధంగా బదులిచ్చారు. "మీ ఆటోమొబైల్ పరిశ్రమ ఎలా పనిచేస్తుందో, రాజకీయాలు కూడా అలాగే ఉంటాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి డబ్బులు ముట్టాయి. అది రాజకీయంగా నన్ను దెబ్బతీయడానికే. అందులో ఎలాంటి నిజం లేదు. ప్రతి విషయం స్పష్టంగా ఉంది" అని గడ్కరీ అన్నారు. ఇథనాల్ మిశ్రమం అనేది విదేశీ ఇంధన దిగుమతులకు ప్రత్యామ్నాయమని, ఖర్చు తక్కువని, కాలుష్య రహితమని, పూర్తిగా స్వదేశీ అని ఆయన పునరుద్ఘాటించారు. భారత్ ఏటా శిలాజ ఇంధనాల దిగుమతి కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తోందని గడ్కరీ గుర్తుచేశారు. ఆ దిగుమతులను తగ్గించి, ఆ డబ్బును దేశ ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడం మంచిది కాదా అని ఆయన ప్రశ్నించారు. "మనం మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నాం. ఈ విధానం వల్ల రైతులకు రూ. 45,000 కోట్లు లాభం చేకూరింది" అని ఆయన వివరించారు. కాలుష్యం కోణంలోనూ ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత కాలుష్య స్థాయిలు ఇలాగే కొనసాగితే ఢిల్లీ వాసుల ఆయుష్షు పదేళ్లు తగ్గిపోతుందని ఓ నివేదిక చెబుతోంది. ప్రపంచమంతా కాలుష్యాన్ని తగ్గించాలని అంగీకరిస్తోంది" అని తెలిపారు. E20 పెట్రోల్ వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజిన్ భాగాల జీవితకాలం తగ్గిపోతోందని కొందరు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వాదనలు అవాస్తవమని ప్రభుత్వం కొట్టిపారేసింది. వాహన మైలేజీ అనేది కేవలం ఇంధనంపైనే కాకుండా, నడిపే విధానం, టైర్లలో గాలి, ఏసీ వాడకం, సరైన నిర్వహణ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. పైగా, E20 పెట్రోల్ వల్ల మెరుగైన యాక్సిలరేషన్, రైడ్ క్వాలిటీతో పాటు కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ విధానాన్ని వెనక్కి తీసుకుంటే కాలుష్య నియంత్రణలో సాధించిన ప్రగతిని కోల్పోవాల్సి వస్తుందని పేర్కొంది.



# బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే


- కావాలనే యూరియా సరఫరా చేయడం లేదు
- యూరియా కొరతపై విపక్షాలు దుష్ప్రచారం
- రైతులను కావాలనే బీఆర్ఎస్ రెచ్చగొడుతోంది
- కామారెడ్డిలో పర్యటన మంత్రి సీతక్క

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



యూరియా కొరత పై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి సీతక్క అన్నారు. యూరియా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందన్నారు. కావాలనే బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి రోడ్లపై ధర్నా చేయిస్తున్నారని విమర్శించారు. నేడు కామారెడ్డిలో పర్యటించిన ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క.. బీబీపేట, దోమకొండ, భిక్కనూరులో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఫైర్ అయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే.. కావాలనే యూరియాను సరఫరా చేయడం లేదని ఆరోపించారు. రైతులను పట్టించుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ పార్టీ బతుకుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పబ్లిక్ లో నుంచి వచ్చారని... ఫార్మ్ హౌస్ లో నుంచి అమెరికా నుంచి వచ్చిన వారు కాదన్నారు. ఈనెల 15న కామారెడ్డిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. బీసీ బిల్లు ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. రాష్ట్రంలో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్క బస్తా యూరియా దొరికినా మహాభాగ్యం అనుకుంటూ రాత్రి, పగలు క్యూలైన్లలో అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. కొన్నిచోట్ల ఓపిక నశించి ఆందోళనలకు దిగుతున్నారు. రైతు వేదికల ఎదుట యూరియా టోకెన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. సకాలంలో యూరియా పంపిణీ చేయకపోవడంతో వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్నారు.

## దేశంలో అత్యధిక ఆస్తులు కలిగిన ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్



- 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఏడీఆర్ నివేదిక వెల్లడి
- రూ.685.51 కోట్ల ఆదాయంతో బీఆర్ఎస్‌కు అగ్రస్థానం
- టాప్-5లో చోటు దక్కించుకున్న టీడీపీ, వైసీపీ
- రెండో స్థానంలో టీఎంసీ, మూడో స్థానంలో బీజేడీ
- మొత్తం ఆదాయంలో 83 శాతం వాటా ఈ ఐదు పార్టీలదే

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):**

దేశంలోని ప్రాంతీయ పార్టీల ఆదాయంలో తెలుగు రాష్ట్రాల పార్టీలు సత్తా చాటాయి. 2023 24 ఆర్థిక సంవత్సరానికి గాను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం, తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దేశంలోనే అత్యంత సంపన్న ప్రాంతీయ పార్టీగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ జాబితాలోని తొలి ఐదు స్థానాల్లో మూడు తెలుగు పార్టీలు ఉండటం విశేషం.ఏడీఆర్ నివేదిక వివరాల ప్రకారం, 202324లో బీఆర్ఎస్ రూ.685.51 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఆ తర్వాతి స్థానంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రూ.646.39 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ (బీజేడీ) రూ.297.81 కోట్లతో మూడో స్థానంలో ఉంది. ఇక, ఏపీకి చెందిన అధికార టీడీపీ రూ.285.07 కోట్లతో నాలుగో స్థానాన్ని, వైసీపీ రూ.191.04 కోట్లతో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు 40 ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయం రూ.2,532.09 కోట్లుగా ఉందని ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది. అయితే, ఈ మొత్తం ఆదాయంలో సింహభాగం కేవలం ఐదు పార్టీలదే కావడం గమనార్హం. తొలి ఐదు స్థానాల్లో ఉన్న బీఆర్ఎస్, టీఎంసీ, బీజేడీ, టీడీపీ, వైసీపీల వాటానే ఏకంగా 83.17 శాతంగా నమోదైంది. మిగిలిన పార్టీలన్నీ కలిపి కేవలం 17 శాతం లోపే ఆదాయాన్ని కలిగి ఉన్నాయని ఈ నివేదిక గణాంకాలు తెలిపాయి.

## ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి ఉన్నాం.. మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ప్రజాస్వరం**

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలబడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిఅన్నారు. గురువారం మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో ఈనెల 15 తేదీన కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తదితరులతో కలిసి సమీక్షించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అందుకే స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లను బీసీల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సమావేశంలో మంత్రులు అభిప్రాయపడ్డారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో సాధించామని అన్నారు. ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్టాత్మకమైందని ఈ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించారు.

## స్టాక్ మార్కెట్‌పేరుతో బడా మోసం

- రూ.1000 కోట్ల వసూళ్లు..!

**హైదరాబాద్, ప్రజాస్వరం**

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఏవీ టెక్నాలజీస్ పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఏవీ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లో పెట్టు బడుల పేరుతో 1000 కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది. గడ్డం వెంకట్రావు, గడ్డం వేణుగోపాలు కలిసి డబ్బులు వసూలు చేశారని చెబుతున్నారు. రెండు రాష్ట్రాల నుంచి 4500 మంది నుంచి డబ్బులు వసూలు చేశారు. ఏవీ టెక్నాలజీస్, ఐఐటీ టెక్నాలజీస్, ఏవీ రియాల్టీ పేరుతో కంపెనీలు ఏర్పాటు చేశారు. తమ ద్వారా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేశారు. తమ ద్వారా పెట్టిన పెట్టుబడులకు 6% చొప్పున వడ్డీ ఇస్తామంటూ మాయమాటలు చెప్పి జనాలను నమ్మించారు. గడ్డం వేణుగోపాల్ రెండు రాష్ట్రాల నుంచి వసూలు చేసిన డబ్బులను స్టాక్ మార్కెట్లో పెట్టాడు. దాదాపు రూ. 400 కోట్ల రూపాయల వరకు తిరిగి చెల్లించకుండా మోసం చేశాడు. ఏవీ టెక్నాలజీస్ మోసంపై సైబరాబాద్ ఎకనామిక్ అండ్ ఆన్లైన్ క్రైమ్స్ వింగ్ కేసు నమోదు చేసింది. గడ్డం వేణుగోపాల్, గడ్డం వెంకట్రావుతో పాటు సీఈవో శ్రేయ పాల్ అరెస్ట్ చేశారు. వసూలు చేసిన డబ్బుల్ని విదేశాలకు మళ్లించినట్లు గుర్తించారు.



# వాస్తవాలు ప్రజలకు తెలియాలి

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

**మన్యం జిల్లా/ గుమ్మలక్ష్మీపురం ( ప్రజాస్వరం ) :**
**గుమ్మలక్ష్మీపురం మండలంలో ప్రతి కార్యక్రమాన్ని రాజకీయ రంగంలోకి లాగి, రైతుల పేరుతో నాటకాలు ఆడటమే వైసీపీ పద్ధతి అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫేక్ ప్రచారాలు కుట్రలతో మోసం చేసే ప్రయత్నం చేస్తూ, గత ఐదేళ్లు రైతుల కష్టాలను పట్టించుకోని జగన్ ఇప్పుడు రైతుల పేరు చెప్పడం డ్రామానే అన్నారు.**




### ఎరువుల లభ్యత, సరఫరా వాస్తవాలు

మన రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ కోసం మొత్తం 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు జరిగింది ఇప్పటివరకు రైతులు 6.11 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగించారు గత ఏడాది సెప్టెంబర్ 10 వరకు 5.6 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగా, ఈ ఏడాది అదనంగా 1.04 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువగా రైతులు కొనుగోలు చేశారు. యూరియాతో పాటు డీఏపి మరియు ఇతర ఎరువులు కూడా 20% అధికముగా రైతులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నులు స్టాక్ లో ఉన్నాయి. త్వరలోనే మరో 30 వేల మెట్రిక్ టన్నులు చేరతాయి. దేశీయ ఉత్పత్తి నుంచి మన రాష్ట్రానికి కేటాయించిన 80 వేల మెట్రిక్ టన్నులలో 12 వేల మెట్రిక్ టన్నులు చేరాయి. మిగతావి కూడా రాబోయే రోజుల్లో వస్తాయి. కేంద్రమంత్రి జేపీ నడ్డా జోక్యంతో కాకినాడ పోర్టుకు అదనముగా ఏడు రాక్స్ వస్తున్నాయి. వైజాగ్, న్యూ మంగళూరు, రాయఘడ్ పోర్టుల నుంచి కూడా సరఫరా కొనసాగుతుంది. రైతులు ఎక్కువగా యూరియానే వాడటానికి కారణం ధర తక్కువగా ఉండటమే. (45 కేజీల బస్తా 250 దీని మీద 1900 సబ్సిడీని కేంద్రం భరిస్తుంది.

### రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు

రబీ సీజన్ కోసం 9.38 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా సిద్ధం చేస్తుంది ప్రభుత్వం. కాఫీ రైతులకు కొత్త తెగులు సమస్య వచ్చిన వెంటనే పంట తొలగించి పరిహారం అందజేస్తుంది. మార్కెట్ ఒడిదుడుకుల వలన ఇబ్బంది పడ్డ మామిడి, పొగాకు, మిరప, కోకో రైతులకు తక్షణ సాయం. హెచ్డి బార్లీ పొగాకు రైతులకు 200 కోట్లు, మామిడి రైతులకు 260 కోట్లు, కోకో రైతులకు 20 కోట్లు విడుదల చేసి ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి విడతలోనే 3200 కోట్లు విడుదల చేసాం. ధాన్యం కొనుగోలుకు 13,500 కోట్లు ఖర్చు చేసి రైతులకు 24 గంటల్లోనే చెల్లింపులు చేసాం. వైసిపి ఇప్పుడు రైతుల పేరుతో నాటకాలు ఆడుతూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తుంది. కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతి దశలో రైతులకు అండగా నిలబడి, ఎరువుల లభ్యతను పర్యవేక్షిస్తూ, సకాలంలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉంది.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**శామీర్‌పేట, సెప్టెంబర్ 11(ప్రజాస్వరం) :**
తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో మండల పరిషత్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 5న పాఠశాలలకు సెలవు నేపథ్యంలో గురువారం కార్యక్రమం నిర్వహించి డా.రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయులను సన్మానించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ దేవరయాంజాల్ మాజీ ఉప సర్పంచ్ నాలుక లక్ష్మి నారాయణ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, దేవరయాంజాల్ శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ పేండం లక్ష్మి నారాయణ, మాజీ ధర్మకర్త పట్నం నర్సింహా రెడ్డితో కలిసి మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణితో పాటు ఉపాధ్యాయులు రవీందర్ చారీ, లలిత, శివలక్ష్మి, రాఖీ, మమతను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యాసేవ అనేది సమాజ నిర్మాణానికి మూలస్తంభం భవిష్యత్ తరాల తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనది అని ప్రశంసించారు. ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ఈ విధంగా గౌరవం అందిస్తున్న నాలుక లక్ష్మి నారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని కోరిన ఎస్కే మౌలానా



**శామీర్‌పేట, సెప్టెంబర్ 11(ప్రజాస్వరం) :**
తెలంగాణ రాష్ట్ర తుర్క కాశ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని గురువారం తెలంగాణ తుర్క కాశ సంక్షేమ సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు షేక్ మౌలానా మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక బంధు 10 లక్షల రూపాయలు 45 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికునికి కార్మిక పెన్షన్ ఇవ్వాలని రాయి కొట్టే కార్మికునికి ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినచో మెడికల్ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని వారి కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం. ప్రభుత్వ భూములలో ఉన్న గుట్టలను మా సంఘ సొసైటీకి ప్రభుత్వం ఇవ్వాలని అలాగే తురక కాశ గుడాలకు రాష్ట్ర ప్రభుత్వం దత్తత తీసుకొని అభివృద్ధి చెయ్యాలని రానున్న అసెంబ్లీ సమావేశాలు ప్రభుత్వంతో మాట్లాడి పైన తెలిపిన సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని మాజీ మంత్రివర్యులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గారిని కోరడం జరిగింది, అనంతరం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తుర్క కాశ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగిన పరిష్కారం చూపుతానని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల గురించి మాట్లాడి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని భరోసా కల్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచి జాము రవి, మాజీ వార్డు సభ్యులు బురుగు యదగిరి, నాయకులు భూపాల్ రెడ్డి, ఆర్.రాములు తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# అంత్యోదయే లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన

- **వేరే దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నవ్వడానికి నాయకత్వ లోపమే కరణం**
- **జీఎస్టీ స్లాబ్ తగ్గింపు తో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు**
- **స్వదేశీ వస్తువుల అమ్మకాన్ని ప్రోత్సహించండి**
- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**మెదక్, సెప్టెంబర్ 11, (ప్రజా స్వరం) :**
బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రం జీకేఆర్ గార్డెన్స్ లో జీఎస్టీ పై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ రఘునందన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి నాయకత్వ లోపమే కారణమన్నారు. 12 లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపు ఇచ్చిన ఘనత కూడా ఆయనదే అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను అంత్యోదయం వైపు తీసుకెళ్తున్నారు అన్నారు. భారతదేశంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన ఈ 11 సంవత్సరాల్లో 25 కోట్ల ప్రజలను దారిద్రరేఖకు దిగువగా ఉన్న వారిని దారిద్రరేఖ పైకి తీసుకువచ్చారని, ఇదే అంత్యోదయానికి మేం చేసిన పరిష్కారమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జిఎస్టి స్లాబుల తగ్గింపు పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేస్తుందని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు 3 వేల నుండి 4 వేల వరకు లాభం చేకూరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భారతీయ జనతా పార్టీ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో 8 ఏళ్ల పాపాన్ని మోడీ కడుక్కున్నారన్నారు. భారతదేశ మౌనమే ప్రపంచ దేశాలకు సమాధానం చెబుతుందని అంటూ ట్రంప్ ను ఎదిరించి నరేంద్ర మోడీ దేశాన్ని కాపాడుకుంటానని నరేంద్ర మోడీ వేసిన అడుగులే స్వదేశీ వైపు వేసే అడుగులని అన్నారు. ప్రతి ఒక్క వ్యాపారస్తుడు తమ దుకాణాల్లో స్వదేశీ వస్తువులను అమ్మబడును అనే బోర్డును పెట్టాలని కోరారు. విదేశీ వస్తువులను వాడడం వల్ల మనదేశంలోని కులవృత్తులన్నీ కూడా కనుమరుగై పోతున్నాయని అన్నారు.



ఒక ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే పేదవారికి జీఎస్టీ తగ్గించడం వల్ల 15 వేల వరకు ఆదావుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, మండల అధ్యక్షురాలు బెండ వీణ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోండి

- **ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నేతల వినతి**

**శామీర్‌పేట, సెప్టెంబర్ 11(ప్రజాస్వరం) :**
శామీర్ పేట్ గ్రామంలోని జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ని గురువారం బీజేపీ నాయకులు కలిసి వివరించారు. అనంతరం ఎంపి ఈటల కి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎంపీ ఈటల ఏసీపీతో ఫోన్ లో మాట్లాడి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనికి అవసరమైన ఎంపీ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అతి త్వరలో ఈ ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకునేలా చూస్తానని తమతో చెప్పారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివ, పవన్ గౌడ్, విష్ణు, శ్రీకాంత్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.





**మున్సిపల్ కమిషనర్‌కు వినతి....**
శామీర్ పేట్ గ్రామంలోని జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై చర్యలు తీసుకోవాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాజీవ్ రహదారి మలుపుల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా రేడియం స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ జ్యోతి స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామనట్లు తెలిపారు.



# జర్నలిస్ట్ రాము కుటుంబానికి టి.ఎస్.జే.యూ నేతల పరామర్శ

**భూపాలపల్లి సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల మండల జర్నలిస్ట్ సోన్నారి రాము తండ్రి సోన్నారి సమ్మయ్య ఇటీవల మరణించగా గురువారం దశ దిన ఖర్మకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎస్ యు జె ఐ) నేతలు హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించారు. చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ జే యూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి కడపాక రవి తదితరులు పాల్గొన్నారు.


# పరకాల కాంగ్రెస్ లో వర్గ పోరు లేదు

**పరకాల సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** పరకాల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి వర్గ పోరు లేదని ఆ పార్టీకి చెందిన నాయకులు తెలిపారు. గురువారం పరకాల పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు కాంగ్రెస్ పార్టీ ఐక్యతను చూసి ఓర్వలేక పార్టీలో గ్రూపు తగాదాలు ఉన్నాయని ప్రచారం చేయడం పద్ధతి కాదన్నారు. పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వెనకాలే ఉంటూ ఆయన చేసే అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో పాత కొత్త కలయికతో అందరం కలిసి సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు వారు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పరకాల పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలను, గ్రామాలను అభివృద్ధి చేస్తున్న రేవూరి ప్రకాష్ రెడ్డికి అండగా ఉండి ప్రతి కార్యకర్త అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నట్లు పేర్కొన్నారు. పరకాల పట్టణంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాన్ని చూపించిన వ్యక్తిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని పరకాల ప్రజలు ఎన్నింటికి మరువరని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పరకాల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, నడికుడ మండల అధ్యక్షుడు దేవేందర్ గౌడ్, సంగం, గీసుకొండ, 15,16,17, డివిజన్ అధ్యక్షుల తోపాటు సమన్వయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# రైతాంగానికి యూరియాను సరపర చేసి రైతు కష్టాలను తీర్చాలి.

**మక్తల్ ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** అమరచింత తాహసిల్దార్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి బి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియా, ఎరువులను వెంటనే సరఫరా చేయాలని. యూరియా సకాలంలో సరఫరా చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో రావడంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండడంతో వరి నాట్లు ముమ్మరంగా ఉన్నాయి సకాలంలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందనరు ఈ కొరతను అదునుగా చూపించి అనేకమంది డీలర్లు 40 కిలోల యూరియా బస్తాకు రూ.267 వసూలు చేయాల్సి ఉండగా అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి కూడా డీలర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కోరారు. కేంద్ర ప్రభుత్వం 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినప్పటికీ కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని గుర్తు చేశారు. ఇంకా రాష్ట్రానికి 1.94 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉందనీ, వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతానికి ఆ లోటు 2.24 లక్షల టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రావాల్సిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అంజి రెడ్డి రాజు, బాలకృష్ణ నయీమ్ పాల్గొన్నారు.



# నీటి సమస్యపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు



**వలిగొండ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలోని వివిధ వార్డులలో ఉన్నటువంటి నీటి సమస్యల గురించి గురువారం రోజున. బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో జలంధర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో సానుకూలంగా స్పందించి తక్షణమే సమస్యలు పరిష్కరిస్తానని బిజెపి నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్. బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి చందా ఇవ్వలేదని.. దళిత కుటుంబాలను
# కుల, గ్రామ బహిష్కరణ

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నరసింహ డిమాండ
- ఇప్పటికే జరిగిన ఘోర సంఘటనపై జగిత్యాల జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడిన చిలకమర్రి
- డప్పు చాటింపుతో మరీ కుల, గ్రామ బహిష్కరణ నా...?
- ఇంకా ఏ సమాజంలో బ్రతుకుతున్నామంటూ మండిపాటు
- కఠినమైన చట్టాలతో కూడిన చర్యలు తీసుకుంటే తప్ప మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావు
- ప్రభుత్వానికి చిలకమర్రి సూచన





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** వినాయకుడి చందా ఇవ్వలేదని నాలుగు దళిత కుటుంబాలను కుల, గ్రామ బహిష్కరణ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు, టిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలిండియా బహుజన్ సత్తా అధ్యక్షులు, పూలే అంబేద్కర్ మిషన్ నేషనల్ కో ఆర్డినేటర్ చిలకమర్రి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ జగిత్యాల నాలుగు దళిత కుటుంబాలను కుల, గ్రామ బహిష్కరణ చేసిన సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లెడ గ్రామానికి చెందిన గాలి పల్లి అంజితో పాటు అతని బంధువులైన నాలుగు కుటుంబాలను గ్రామస్తులు నిర్ణయించిన మేరకు వినాయక చందా ఇవ్వలేదని కక్షగట్టి కుల బహిష్కరణ చేయడమే కాక వారితో ఎవరు మాట్లాడినా వారిని కలిసిన 25 వేల రూపాయల జరిమానా విధిస్తామని చెప్పడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని మండిపడ్డారు. సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం గ్రామంలో డప్పు చాటింపు వేసి మరీ ఇంతటి ఘోరానికి పాల్పడడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై చిలకమర్రి నరసింహ జిల్లా పోలీస్ అధికారులతో బాధితులతో మాట్లాడారు. దళితులను కుల, గ్రామ బహిష్కరణ చేసిన నిందితులైన పదిమందిపై కేసు నమోదు చేసి చట్ట పరంగా చర్య తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండడం కోసం యావత్ తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలు అందరూ ఐక్యమై గొంతెత్తి ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఐక్యమత్యంతో కలిసి మెలసి ఉండాల్సింది పోయి ఇలాంటి సంఘటనలను ప్రేరేపిస్తూ కారణమవుతున్న ఎంతటి వారైనా వదిలి పెట్టకుండా చట్టరీత్యా తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారులను చిలకమర్రి నరసింహ డిమాండ్ చేశారు.


# జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం మరియు భారత్ స్కౌట్స్ మరియు గైడ్స్ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల ర్యాలీ

**గాజువాక, సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** గాజువాక మండలం విశాఖపట్నం జిల్లాలో హై స్కూల్ రోడ్ లో గల స్వామి విద్యానికేతన్ పాఠశాలలో జరిగే జాతీయ అరణ్య శహీదుల దినోత్సవం కార్యక్రమంలో ముందుగా ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ పి హేమలత చేతుల మీదుగా మొక్కలు నాటిన తరువాత జరిగే కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణస్వామి అధ్యక్షత వహించగా, ఈ కార్యక్రమానికి ప్రధాన అతిధిగా విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్, విశాఖపట్నం కార్పొరేషన్ 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మరియు విశాఖపట్నం జిల్లా స్కౌట్స్ మరియు గైడ్స్ కార్యదర్శి దాసరి వేణుగోపాల్ మాట్లాడిన తర్వాత రాష్ట్ర స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ మరియు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు జండా ఊపి ఐదు కిలోమీటర్ల ర్యాలీను ప్రారంభించగా ఆ ర్యాలీ సాయిరాం నగర్, శంకర్ నగర్, అశోక్ నగర్, మారుతీ నగర్, గాంధీనగర్ మరియు హై స్కూల్ రోడ్ మీదుగా ఆటోనగర్ పాత గాజువాక మీదుగా ర్యాలీ జాతీయ అరణ్య శహీదుల దినోత్సవం సెప్టెంబర్ 11 కార్యక్రమము స్వామి విద్యానికేతన్, సాయిరాం నగర్, హై స్కూల్ రోడ్, గాజువాక, విశాఖపట్నం. స్కౌట్స్ మరియు గైడ్స్ విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు, విశాఖపట్నం జీవీఎంసీ కార్పొరేటర్ 67వ వార్డు పల్లా శ్రీనివాస్ రావు, ప్రభుత్వ విద్యాధికారిని డాక్టర్ పి హేమలత , స్కౌట్స్ మరియు గైడ్స్ జిల్లా సెక్రెటరీ దాసరి వేణుగోపాల్ రావు పాఠశాల కరస్పాండెంట్ పాలూరు దేవి మరియు ఉపాధ్యాయునులు సింగిరెడ్డి లక్ష్మి తూర్పాటి సూర్య కుమారి సాలాపు రూప లత అచ్యుతుని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు విశాఖపట్నం జిల్లా జనరిజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ ప్రతినిధి మరియు విశాఖపట్నం జిల్లా భారత్ స్కౌట్స్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ లక్ష్మణస్వామి పాలూరు తెలియజేశారు.




# భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి...

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**



**వనపర్తి, సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఖీమ్య నాయక్ తో కలిసి తహసీల్దార్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇవే కాకుండా భూ భారతి సాధారణ దరఖాస్తు లపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 12, 2020 నుండి నవంబర్ 10, 2020 వరకు వచ్చిన సాదా బైనామాలను మాత్రమే నిబంధనల ప్రకారం రెగ్యులరైస్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా భూభారతి నిబంధనలను అమలు చేయాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ లు ఆలస్యం అవుతున్నట్లు ఫిర్యాదు లు వస్తున్నాయని, అధికారులు బాధ్యతగా వ్యవహరించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సూపరిండెంట్లు సునీత, మదన్, తహసిల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

- డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి కృష్ణయ్య.

**వనపర్తి, సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వనపర్తి డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ డి కృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీమతి వి రజని ఆదేశాలను సారం గురువారం వనపర్తి జిల్లాలోని లిటిల్ బర్డ్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి కృష్ణయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం, ఫోక్సో చట్టం గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు.





# అన్ని ప్రభుత్వ, సంక్షేమ, గురుకుల విద్యాలయ సంస్థలకు సన్నబియ్యం మాత్రమే సరఫరా అయ్యేటట్లు చేయాలి.

**అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ ఆదేశం.**



**వనపర్తి, సెప్టెంబర్ 11 (ప్రజాస్వరం):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు నాణ్యమైన సన్న బియ్యం మాత్రమే సరఫరా అయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల సంస్థ డిఎం జగన్ తో కలిసి అన్ని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల డీసీవోలతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు నాణ్యమైన సన్న బియ్యం మాత్రమే సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. నాణ్యతలేని బియ్యం వస్తే వాటిని వెంటనే వెనక్కి పంపించేయాలని సంక్షేమ గురుకులాల అధికారులకు సూచించారు. ఈ విషయంపై ఆయా వసతి గృహాల ఇన్చార్జిలకు గట్టిగా సూచించాలని తెలియజేశారు. బియ్యం విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే గురుకులాల ఇన్చార్జులు, డీసీవో లు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలేని బియ్యాన్ని విద్యార్థులకు పెట్టడానికి వీలు లేదని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ అధికారి అఫ్జలుద్దీన్, డీసీజీవో శుభ లక్ష్మి, డిసిఒలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కుటుంబ వినోదం, భోజనానికి కొత్త చిరునామా సైనిక్‌పూరిలో ఫ్లమెస్"ఎన్"స్పిరిట్స్

**సైనిక్‌పూరి సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** కాప్రా డివిజన్ పరిధిలోని సైనిక్‌పూరిలో ఫ్లమెస్"ఎన్"స్పిరిట్స్ రెస్టారెంట్‌ను పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులు ప్రత్యేక ఆతిథ్యంతో ఆయనకు స్వాగతం పలికారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ స్థానికులకు రుచికరమైన వంటకాలు, సౌకర్యవంతమైన వాతావరణం అందించే ఆధునిక రెస్టారెంట్ ప్రారంభం కావడం ఆనందకరమని అన్నారు. యువత, కుటుంబాలు సంతోషంగా గడిపేందుకు ఇలాంటి ఆహార విందు కేంద్రాలు తోడ్పడతాయని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు మంచి నాణ్యతా ప్రమాణాలతో సేవలు అందించాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆటలు, పెద్దలకు నచ్చిన పాటలను స్క్రీన్‌లో ప్రసారం చేస్తామని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కూడా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్, వై ప్రేమ్ కుమార్, కార్పొరేటర్ స్వర్ణ రాజ్, కార్పొరేటర్ బంగి లక్ష్మణ్, కాసం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల సునీత దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి గొల్లూరి అంజయ్య, మాజీ కార్పొరేటర్ మీనా ఉపేంద్ర రెడ్డి ప్రసన్న, మర్రి మోహన్ రెడ్డి, నర్సింగరావు, రేగల సతీష్ రెడ్డి, వసుపతి సందీప్ గౌడ్, వి సందీప్ గౌడ్ (న్యాయవాది) వ్యాపారవేత్తలు, స్థానికులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.





# మెదక్‌లో భారీ వర్షా లు.. స్తంభించిన జనజీవనం

**తెలంగాణ బ్యూరో సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):**

మెదక్ జిల్లాలో గురువారం కురిసిన భారీ వర్షం సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. అనేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. కుండపోత వర్షం కారణంగా రామ్‌దాస్ చౌరస్తా, గాంధీనగర్, బృందావన్ కాలనీలు వంటి ప్రాంతాలు నీట మునిగాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టిడిపిఎస్) ప్రకారం, రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం మెదక్‌లో నమోదైంది, మెదక్ (ఆర్డీఓ ఆఫీస్) ప్రాంతంలో 176.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. తరువాత మెదక్‌లోని రాజ్‌పల్లిలో 132.5 మి.మీ., నల్గొండ జిల్లాలోని గుండ్లపల్లెలో 112.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మెదక్‌లోని కుల్చారం (87 మి.మీ), మెదక్‌లోని పాతూర్ (81 మి.మీ), హవేలీ ఘన్‌పూర్‌లోని నాగాపూర్ (64.5 మి.మీ) ముఖ్యమైన వర్షపాతం నమోదైంది. వనపర్తి పాన్‌గల్ మండలంలో 61.3 మి.మీ, రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో 60.8 మి.మీ. నాగర్ కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో 40 మి.మీ నుండి 55 మి.మీ వరకు మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షంతో మెదక్ గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజీలోకి వరద నీరు చేరింది. అప్రమత్తమైన ప్రిన్సిపాల్ విద్యార్థులను ముందు జాగ్రత్తగా ఇంటికి పంపించారు. 15 రోజుల క్రితమే భారీ వర్షాలతో కాలేజీ నీట మునిగింది.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో తెలంగాణ దేశానికి ఆదర్శం

**మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలబడుతుందని రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తదితరులతో కలిసి సమీక్షించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అందుకే స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను బీసీల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అడ్డుకుంటోందని సమావేశంలో మంత్రులు అభిప్రాయపడ్డారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో సాధించామని అన్నారు. ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్టాత్మకమైందని ఈ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించారు.




# వర్షా లకు కూలిన కలెక్టర్ భవనం పైకప్పు

**ఆదిలాబాద్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం)**

జిల్లా కలెక్టరేట్ భవనంలోని పురాతన గది పైకప్పు కూలింది. గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థలో ఉన్న కలెక్టర్ వెనుక భాగం కూలిపోయింది. అతి పురాతన నిజాం కాలం నాటి భవనం ఉండడం వల్ల కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరు లేక పోవడం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. జిల్లా పాలనాధికారి ఉండే, జిల్లాకు సంబంధించి వివిధ రికార్డులు భద్ర పరిచే కార్యాలయాన్ని పట్టించుకోకపోవడం విస్మయానికి గురి చేస్తుంది. దీనికి అధికారుల నిర్లక్ష్యమని తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని పాత భావనానికి మరమ్మతులు చేయించకపోవడం కొసమెరుపు.



# 'మీ అభిప్రాయం చెప్పండి'.. బీఆర్ఎస్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ లేఖ



**హైదరాబాద్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** రాష్ట్రంలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నది. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి.. ఆ తర్వాత అధికార కాంగ్రెస్ గూటికి చేరిన పది మంది ఎమ్మెల్యేలపై వేటు కోసం బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తూనే ఉన్నది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు డైరెక్షన్స్ ప్రకారం.. 10 మంది జంపింగ్ ఎమ్మెల్యేలకు స్పీకర్ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అయితే.. ఇటీవల ఆ పది మంది ఎమ్మెల్యేలు సైతం స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని.. కేవలం అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిశామని.. తమ ఫొటోలు మార్ఫింగ్ చేసి పార్టీ మారినట్లుగా చూపారని వివరణ ఇచ్చారు. అయితే.. తాజాగా స్పీకర్ గడ్డం ప్రసాద్ బీఆర్ఎస్ పార్టీకి లేఖ రాశారు. పది మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణపై పార్టీ అభిప్రాయాన్ని కోరారు. మూడు రోజుల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని కోరారు.

# యూరియా కోసం మహిళలను రోడ్డుపై నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** సీఎం రేవంత్ రెడ్డి రైతులను గోస పెడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. యూరియా కోసం రోజుల తరబడి రైతులను తిప్పలు పెడుతున్నారని, ఆడబిడ్డలను గంటల తరబడి లైన్లలో నిలబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం షాబాద్ లో మాజీ జడ్పీటీసీ అవినాశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు వానాకాలానికి ముందే సాగు విస్తీర్ణం అంచనా వేసి,యూరియా ఎంత అవసరమో ముందుగానే సిద్ధం చేసేవారని గుర్తుచేశారు.కానీ ఇప్పుడు రైతులు రెండు నెలలుగా యూరియా కోసం తిప్పలు పడుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదని విమర్శించారు. పైగా రైతులు చెప్పులు లైన్లలో పెట్టి పడిగాపులు కాస్తుంటే,పడేసిన చెప్పులు తీసుకొచ్చి లైన్లలో పెడుతున్నారని మంత్రులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇంకొందరు మంత్రులు రైతుల యూరియాను ఇండ్లలో దాచుకుంటున్నారని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు పోలీస్ స్టేషన్లలో టోకన్లు ఇస్తున్నారని,నిలదీస్తే పోలీసులు ఓ రైతును చెంపమీద కొట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా ఉందని,ఆ పార్టీ నేతలు వార్డ్ మెంబర్ కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు.అందుకే రేవంత్ రెడ్డి నేడు, రేపు అని స్థానిక సంస్థల ఎన్నిలు వాయిదా వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ముఖం బాగాలేక అద్దం పగులగొట్టినట్లు... రైతుల ఓట్లతో గెలిచిన సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లను పార్టీ మారాలని కాంగ్రెస్ నేతలు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆడబిడ్డలు బయటికి రావొద్దని ఇంటింటికీ నల్లా పెట్టిస్తే... రేవంత్ రెడ్డి మాత్రం యూరియా కోసం లైన్లలో నిలబెడుతున్నారని విమర్శించారు. మహిళలు కనిపిస్తే కోటీశ్వర్లను చేస్తా అంటున్న రేవంత్ రెడ్డి... ఎంతోమందిని చేశారో చెప్పాలని ప్రశ్నించారు.24 గంటల కరెంట్, రైతుబంధు, యూరియా ఇలా ఏవీ లేకుండా చేశాడని మండిపడ్డారు.

**గ్రూప్ –1పోస్టుల పేరిట రూ.1700 కోట్ల కుంభకోణం: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

కాంగ్రెస్ నేతలు గ్రూప్1 పోస్టుల పేరిట రూ.1700 కోట్ల కుంభకోణానికి తెరతీశారని మాజీ ఐపీఎస్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు.తాను, దాసోజు శ్రవణ్‌తో కలిసి, కేటీఆర్ ఆదేశాల మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వెళితే, అక్కడ ఓ నిరుద్యోగి చెప్పిన మాటలు విని విస్తుపోయానన్నారు.ఆ నిరుద్యోగి ఒక కాంగ్రెస్ నాయకుడికి ఫోన్ చేస్తే, ట్రాన్స్‌ఫర్ పోస్టులకు రూ.30 లక్షలు, డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ ఎస్పీ ఉద్యోగాలకు రూ.30 లక్షలు సరిపోదని,రూ.3 కోట్లు ఇస్తేనే ఉద్యోగం వస్తుందని చెప్పాడని ఆరోపించారు.ఒక్కో పోస్టుకు రూ.3 కోట్లు అంటే 563 పోస్టులను రూ.1700 కోట్లకు అమ్మాలని చూశారని విమర్శించారు.పేదలు కష్టపడి తమ పిల్లలకు కోచింగ్‌కు పంపిస్తే, వారికి చెందాల్సిన పోస్టులను అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. హైకోర్టుకు వెళితే మొట్టికాయలు వేసిందని, కనీసం ప్రశ్నాపత్రాలు కూడా దిద్దలేని అసమర్థులు రేవంత్ రెడ్డి సర్కారులో ఉన్నారని ఆరోపించారు. సొసైటీలకు, రైతు వేదికలకు రావాల్సిన యూరియా కాంగ్రెస్,బీజేపీ నేతల గోదాముల్లోకి వెళ్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.రూ.270 కు రావాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్‌లో రూ.800కు అమ్ముతున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపిస్తే, కాంగ్రెస్ నేతలు 6 లక్షల మెట్రిక్ టన్నులని చెబుతున్నారని, కాంగ్రెస్, బిజెపి నాయకుల ఇండ్లు, గోదాముల్లో చెక్ చేస్తే యూరియా బయటపడుతుందన్నారు. ఎమ్మెల్యే యాదయ్య ఓట్లేసిన రైతులు, ప్రజలను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని, రాజీనామా చేసి ఒకసారి మొఖం చూపించాలని సవాల్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హోం మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి లేకపోయి ఉంటే ఇంకెంతో మంది చనిపోయేవారని అన్నారు. ఆమె, తాను ఉన్నాము కాబట్టే ఆంధ్రా అధికారులు ఉద్యమాన్ని అణిచేందుకు ఎంత ప్రయత్నించినా కానివ్వలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి కొడుకు, నేతలు దేశమోళ్ల ఆంజనేయులు, బిఆర్ఎస్ షాబాద్ మండల అధ్యక్షుడు గూడూరు నరసింహ రావు, జనరల్ సెక్రెటరీ శ్రీరామ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీ రాజేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, చేవెళ్ల మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్ గౌడ్, కౌకుంట్ల రాజేందర్ రెడ్డి, గోనె కరుణాకర్ రెడ్డి,శేరి రాజు, దర్శన్, ప్రభాకర్ రెడ్డి, జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ షాబాద్ మండలం మహిళా అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.



# హుస్నాబాద్ అభివృద్ధికి కృషి

- శంకుస్థాపనలు చేసిన పొన్నం
- ఆర్టీసీ మోడల్ బస్ ఆవిష్కరణ



**మెదక్ బ్యూరో సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):**

సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, కోహెడ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గురువారం సాయంత్రం హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద 1932 నిజాం కాలం నాటి ఆల్బియన్ ఆర్టీసీ మోడల్ బస్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుస్నాబాద్‌ను పర్యాటకం, విద్య, పరిశ్రమ, వ్యవసాయం, ఉద్యోగ కల్పనకు సంబంధించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ, జనగాం జిల్లాలకు కూడలిగా ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు, ఇండస్ట్రియల్ పార్క్, మహాసముద్రం గండి, సర్దార్ సర్వాయి పాపన్న నిర్మించిన ఎల్లమ్మ గుడి, పొట్లపల్లి శివాలయం వంటి వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరీమ అగ్రవాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి, ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్‌తో పాటు డిపో మేనేజర్లు, ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ దాడుల ముప్పును సమష్టిగా ఎదుర్కొందాం

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):**



దేశంలో డిజిటల్ విప్లవం నడుస్తున్న సమయంలో సైబర్ దాడుల ముప్పు కూడా పెరుగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌లు, ప్రొఫెషనల్స్, విద్యార్థులను ఒకచోట చేర్చి వారు చేపట్టే కొత్త ఆవిష్కరణలు, ఆలోచనలతో పౌరులను, సంస్థలతోపాటు ఆర్థిక వ్యవస్థను రక్షించాలన్నారు. అందుకు అవసరమైన సాధనాలను రూపకల్పన చేసేందుకు వేదికలుగా 'హ్యాకథాన్' వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రిప్టో కరెన్సీ లావాదేవీలను ట్రాక్ చేయడం, డీప్‌ఫేక్ వీడియోలు, వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లను ఎదుర్కోవడానికి కృషి చేస్తున్నారన్నారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాల డైనమిక్ సవాళ్లను ఎదుర్కోవడం ముందున్న ముఖ్యమైన కర్తవ్యమని, వీటిని ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

గురువారం రామాంతాపూర్ లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో సైఫర్‌కాప్ 2025" అవార్డుల ప్రదానోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందిస్తూ ట్రోఫీలతోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేసి సీడీటీఐ త్రైమాసిక పత్రిక హోరిజన్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఒక వ్యక్తి, సంస్థ సైబర్ ముప్పును ఒంటరిగా ఎదుర్కోవడం కష్టమని వాటిని అందరం కలిసికట్టుగా సాంకేతికత సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ సైబర్ ముప్పునుండి రక్షణ కల్పించవచ్చన్నారు. ప్రధాని మోడీ దూరదృష్టి, సమర్థవంతమైన నాయకత్వంలో సైబర్ సెక్యూర్ భారత్‌ను నిర్మించడానికి కట్టుబడి ఉన్నామని, సాంకేతిక నైపుణ్యం, అనుభవంతో సైబర్ సెక్యూర్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.



# కవితతో చింతమడక వాసుల భేటీ

**హైదరాబాద్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఆమె తండ్రి కెసిఆర్ సొంత ఊరు చింతమడక గ్రామస్తుల భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన చింతమడక గ్రామస్తులు ఈనెల 21న ఎంగిలి పూల బతుకమ్మ పండుగకు రావాలని ఆహ్వానించారు. కవిత స్పందిస్తూ..గొప్ప ఉద్యమకారుడిని కన్న గొప్ప ఊరు మా చింతమడక అని పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో వచ్చి తనను బతుకమ్మకు ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు. తాను చింతమడక నుంచి ఎంతో నేర్చుకున్నానని, తన చిన్నప్పుడు చింతమడకలో బతుకమ్మ ఆడిన రోజులు ఇంకా కండ్ల ముందే ఉన్నాయని గుర్తు చేసుకున్నారు.

# బీసీసీఐ అధ్యక్ష పదవి రేసులో సచిన్...?

- బీసీసీఐ అధ్యక్ష పదవిపై సచిన్ క్లారిటీ
- జరుగుతున్న ప్రచారంలో నిజంలేదన్న సచిన్ మేనేజ్ మెంట్ సంస్థ
- సెప్టెంబర్ 28న బీసీసీఐ ఏజీఎంలో నూతన అధ్యక్షుడి ఎన్నిక



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్ష పదవికి తాను పోటీ పడుతున్నట్లు వస్తున్న వార్తలపై క్రికెట్ దిగ్గజం, భారత మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్ స్పష్టత ఇచ్చారు. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆయన మేనేజ్‌మెంట్ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తేల్చిచెప్పింది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డుకు తదుపరి అధ్యక్షుడు సచిన్ కావచ్చంటూ జరుగుతున్న ప్రచారానికి ఈ ప్రకటనతో తెరపడింది.

ప్రస్తుత బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి జులైలో 70 ఏళ్లు నిండటంతో ఆయన పదవీకాలం ముగిసింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం, అధ్యక్ష పదవికి 70 ఏళ్ల వయోపరిమితి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే సచిన్ పేరు బలంగా ప్రచారంలోకి వచ్చింది. అయితే, ఈ వార్తలను ఆయన ప్రతినిధులు ఖండించారు. "బీసీసీఐ అధ్యక్ష పదవికి సచిన్ టెండూల్కర్‌ను పరిశీలిస్తున్నారని లేదా నామినేట్ చేశారని కొన్ని నివేదికలు, పుకార్లు మా దృష్టికి వచ్చాయి. అలాంటి పరిణామాలేవీ జరగలేదని మేము కచ్చితంగా స్పష్టం చేస్తున్నాము. దయచేసి నిరాధారమైన ఊహాగానాలకు ప్రాధాన్యత ఇవ్వవద్దని అందరినీ కోరుతున్నాం" అని సచిన్ మేనేజ్‌మెంట్ సంస్థ తమ ప్రకటనలో పేర్కొంది.

ఈ నెల 28న జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. 2022 అక్టోబర్‌లో రోజర్ బిన్నీ బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు ఆయన స్థానంలో కొత్త వ్యక్తి రానున్నారు. ఈ ఏజీఎంలోనే బీసీసీఐ అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి బోర్డు ప్రతినిధిని కూడా నియమించనున్నారు. దీంతో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

క్రికెట్ నుంచి రిటైరైనా సచిన్ టెండూల్కర్ ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను కలిగి ఉన్నాడు. సచిన్ సాధించిన విజయాలు, వినయం, ఆట పట్ల అంకితభావం నేటి తరం క్రికెటర్లకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. భారత్‌లోనే కాకుండా, ప్రపంచంలోని ప్రధాన క్రికెట్ దేశాల్లో సచిన్ పేరు తెలియని వారు ఉండరు. విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ వంటి ఎందరో ఆధునిక దిగ్గజాలు సచిన్‌ను ఆదర్శంగా తీసుకున్నవారే. అందుకే బీసీసీఐ వంటి అత్యున్నత పదవికి సచిన్ పేరు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, దానిని ఆయన సున్నితంగా తిరస్కరించినట్లయింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999